సాక్షి
పల్నాడు
మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



మెడికల్ కళాశాలకు 'పింగళి' పేరు

మచిలీపట్నం: మచిలీపట్నం మెడికల్ కళాశాలకు జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య పేరును పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీఓ నంబర్ 132 విడుదల చేసింది.



యార్డుకు 28,668 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 28,668 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 26,408 అమ్మకాలు జరిగాయి.

విగ్రహాల ప్రతిష్ట



కర్లపాలెం: గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట సోమవారం నక్కలవానిపాలెంలో అత్యంత వైభవంగా జరిగింది. ఆలయం బయట పోతురాజుస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు.

న్యూస్‌రీల్

డీఎస్సీ ఉచిత శిక్షణ దరఖాస్తు గడువు పొడిగింపు

నెహ్రూనగర్: జిల్లాలో ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ నమోదు గడువును ఈ నెల 21 నుంచి 25 వరకు పొడిగించినట్లు ఎస్సీ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ ఉత్తీర్ణులైన వారికి నవంబర్ 3న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారు జ్ఞానభూమి పోర్టల్‌లో సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రకాశం బ్యారేజ్ దిగువకు నీటి విడుదల



తాడేపల్లి రూరల్: ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రావడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు సోమవారం సాయంత్రం ప్రకాశం బ్యారేజ్ గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా జేఈ రాజేష్ మాట్లాడుతూ ఎగువ పులిచింతల ప్రాజెక్ట్, ఇతర వాగుల నుంచి 2,28,532 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజ్‌కు వచ్చి చేరిందని తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా, 70 గేట్లు ఐదు అడుగులు ఎత్తి దిగువకు 2,20,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. దీంతో పాటు తూర్పు డెల్టా కాలువకు 5513 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 2519 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

25లోగా దరఖాస్తుల స్వీకరణ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): నవంబర్ 11వ తేదీన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని అబుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారంతోపాటు డాక్టర్ అబ్దుల్ హఖ్ ప్రాంతీయ స్థాయి పురస్కారాలకు ఉమ్మడి జిల్లాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉర్దూ అకాడమీ ద్వారా జారీ చేసిన దరఖాస్తు ఫారాలు పూర్తిచేసి ఈనెల 25వ తేదీలోగా డాక్టర్ మహమ్మద్ ముస్తాస్, డైరెక్టర్, సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ మలావికా విల్లా, హెచ్.బి కాలనీ భవానీపురం, విజయవాడ చిరునామాకు స్వయంగా లేదా పోస్టు, కొరియర్ ద్వారా పంపించాలని సూచించారు. పురస్కారాలకు గుంటూరు, పల్నాడు, బాపట్ల, జిల్లాల నుంచి ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



నగరంపాలెం: మధ్యాహ్న భోజన పథకం అమల్లో లోపాలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు లేదా నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హెల్ప్‌లైన్ నంబర్ 15100 ద్వారా తెలియజేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి అన్నారు. ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు సోమవారం రెండో విడతగా మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. భారత్‌పేట, రత్నపురి కాలనీ, సంజీవయ్యనగర్, శారదాకాలనీలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. అన్నం, కూరలు ఎలా ఉన్నాయని పిల్లలను అడిగారు. పరిసరాల పరిశుభ్రత, ఆహార నాణ్యతలో రాజీపడవద్దని, రుచికరమైన భోజనాన్ని పిల్లలకు అందించాలని ఆమె సిబ్బందికి సూచించారు.

మహిళతో జనసేన నేత అసభ్య ప్రవర్తన

పట్నంబజారు: నగరంలోని పాత గుంటూరుకు చెందిన ఒక జనసేన నాయకుడు మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన చోటుచేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పాత గుంటూరుకు చెందిన జనసేన పార్టీకి చెందిన ఓ డివిజన్ అధ్యక్షుడు మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. అయితే సదరు మహిళ, స్థానికులు అతడికి దేహశుద్ధి చేసినట్లు చెబుతున్నారు. ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై పాత గుంటూరు పోలీసులు వివరణ కోరగా... గొడవ జరిగిన మాట వాస్తవమేనని, అయితే ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కర్షకుల కంట కన్నీరు



దుర్గి మండలంలో మిర్చిపంటలో నిలిచిన వర్షపు నీరు

వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్న రైతులు

- ఆగస్టు చివర్లో కురిసిన భారీ వర్షాలు, వరదలకు 10 వేల హెక్టార్లలో పంట నష్టం
- 10 రోజులుగా కురుస్తున్న వర్షం
- కుళ్లుతున్న పత్తి పూత, కాయలు
- మిరపలో విస్తరిస్తున్న తెగుళ్లు
- రైతులను ఆదుకోని ప్రభుత్వం

రైతులపై ప్రకృతి పగబట్టింది. వరుసగా వస్తున్న తుపాన్లు, వరదలకు రైతు కష్టం నీటి పాలవుతుంది. ఇప్పటికే ఖరీఫ్ అరకొరగా సాగైంది. వరుస విపత్తులతో వేసిన పంట రైతులకు దక్కే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం కూడా రైతులను ఆదుకునేందుకు ముందుకు రావడం లేదు. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

సాక్షి, నరసరావుపేట: జిల్లాలో 2,48,350 హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికిగాను 1.75 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగైంది. ఇది ఖరీఫ్ సాగు లక్ష్యంలో 70 శాతం మాత్రమే. ఆగస్టు చివర్లో కురిసిన భారీ వర్షాలకు తోడు జిల్లాలో కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో వచ్చిన వరదకు భారీగా పంట నష్టం చేకూరింది. జిల్లాలో సుమారు 10 వేల హెక్టార్లలలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. వేసిన పంటలు కుళ్లిపోవడంతో కొంత మంది రైతులు తిరిగి మళ్లీ పంటలు సాగుచేశారు. పది రోజులుగా వాయుపీడన ప్రభావంతో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వేసిన పంటలు మళ్లీ దెబ్బతింటున్నాయి. గత వర్షాలకు తట్టుకొని కాపు దశకువచ్చిన పంటలు ఎడతెరిపి లేని వానలకు దెబ్బతింటున్నాయి.


కుళ్లుతున్న పత్తి కాయలు

ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో సాధారణ వర్షపాతం కన్నా సుమారు 60 శాతం అధిక వర్షపాతం నమోదైంది. దాదాపుగా ఈ రెండు నెలల్లో 15 నుంచి 20 రోజులపాటు వర్షం కురిసిన ప్రాంతాలు జిల్లాలో అధికంగా ఉన్నాయి. దీని ప్రభావం పంటలపై తీవ్రంగా పడింది. ముఖ్యంగా పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి పంట తీవ్రంగా దెబ్బతింటోంది. పత్తి పూత, కాయలు కుళ్లిపోతున్నాయి. పంట దిగుబడి ఎకరానికి కనీసం ఐదు క్వింటాళ్లు కూడా దిగిబడి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మిర్చి పంటకు ఎడతెరిపిలేని వర్షాలకు తెగుళ్లు విజృంభిస్తున్నాయి. దీంతో మొక్కలు అర్ధాంతరంగా చనిపోతున్నాయి. మరోవైపు తెగుళ్ల ఆపడానికి మందుల పిచికారీకి రైతులకు ఎక్కువ ఖర్చు అవుతోంది. ఎడతెరిపి లేని వర్షాలకు పురుగుల మందు కొట్టడానికి కూడా సమయందొరకడం లేదు. ఒకవేళ పిచికారి చేసినా రెండు మూడు గంటలలోపే వర్షం కురియడంతో మందు వృథా అవుతోంది. కంది, మొక్కజొన్నల పంటలు అధిక వర్షాలకు ఎదుగుదల మందగించింది.

ఆదుకోని ప్రభుత్వం

రైతులు వరుస వర్షాలకు తీవ్రంగా నష్టపోతుండగా ప్రభుత్వం మాత్రం వారిని ఆదుకొనే ప్రయత్నం చేయలేదు. ఆగస్టు చివర్లో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో సుమారు 10 వేల హెక్టార్లలో నష్టం చేకూరితే కనీసం మూడు వేల హెక్టార్లకు కూడా నష్టపరిహారం అందించలేదు. 33 శాతం నిబంధన పేరిట పంట నష్టపోయిన చాలా మంది రైతుల పేర్లు జాబితాలో లేకుండా చేశారు. పంట పూర్తిగా నష్టపోయిన రైతులకు తిరిగి సాగు చేయడానికి అవసరమైన విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని రైతులు చేసిన డిమాండ్‌ను పట్టించుకున్నపాపాన పోలేదు. గత ప్రభుత్వంలో రైతులకు ఏటా ఠంఛనుగా అందిస్తున్న వైఎస్సార్ రైతు భరోసా నిధులను ఈ ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర వాటా ఇవ్వడంలేదు. కేంద్రప్రభుత్వం విడుదల చేసిన రూ. 2 వేలు మాత్రమే విడుదలయ్యింది. వరుస వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పత్తి పంటకు తీవ్ర నష్టం



రెండు ఎకరాలలో పత్తి పంట సాగుచేశాను. పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తీవ్రంగా నష్టపోతున్నాం. ముఖ్యంగా పత్తి కాయ కుళ్లిపోతుండగా, పిందెలు రాలిపోతున్నాయి. మిరప పంట తీవ్రంగా దెబ్బతింటుంది.

–జక్కా కృష్ణంరాజు, రైతు, గోనెపూడి, నరసరావుపేట రూరల్ మండలం

తెగుళ్ల బెడద పెరిగింది...



మూడు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. అధిక వర్షాల వల్ల మిర్చి పంటలో తెగుళ్ల బెడద ఎక్కువైంది. దీంతో పంట దెబ్బతినడంతోపాటు రైతులకు పెట్టుబడి ఖర్చు అధిక మవుతోంది. రైతులకు కనీసం మిర్చిపంటలకు పురుగుమందులు కొట్టే వెసులుబాటు లభించడం లేదు.

– శ్రీనివాసరెడ్డి, మిరపరైతు, రెడ్డిపాలెం, రొంపిచర్ల మండలం

ప్రొటోకాల్ పాటించని కూటమి ప్రభుత్వం

కలెక్టర్‌కు ఫిర్యాదుచేసిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు



నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష వైఎస్సార్ సీపీకి చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచుల విషయంలో ప్రొటోకాల్ పాటించకుండా అధికారులు అన్యాయంగా వ్యవహరిస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ పి.అరుణ్‌బాబు దృష్టికి వినతి పత్రం ద్వారా తీసుకెళ్లారు. రొంపిచర్ల జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తామంతా రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోబడ్డామన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానాలు అందటంలేదని, అభివృద్ధి పనులకు వేసే శిలాఫలకాలపై పేర్లు నమోదు చేయట్లేదన్నారు. సభలు, సమావేశాలకు సమాచారం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘించటం అంటే రాజ్యాంగాన్ని అవమాన పర్చటమేనని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటమే అవుతుందన్నారు. తమను ఎన్నుకున్న ప్రజలను కూడా అగౌరపర్చటమే అవుతుందన్నారు. అందువలన తమ హక్కులు, గౌరవాన్ని కాపాడి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని కోరారు. దీనిపై కలెక్టర్, అధికారులు ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఓబుల్‌రెడ్డి చెప్పారు. మాచవరం, రాజుపాలెం, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యులు జే.శివయాదవ్, జి.సునీతలక్ష్మి, మస్తాన్‌రావు, నరసరావుపేట ఎంపీపీ ఎం.సుబ్బాయమ్మ, మునుమాక ఎంపీటీసీ గుండాల నాగమణి పాల్గొన్నారు.



స్టేడియంలో ఏర్పాటుచేసిన అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

పోలీసు సేవలు అనిర్వచనీయం

- పోలీసు అమరవీరులకు నివాళులర్పించిన పోలీసు శాఖ
- ముఖ్య అతిథులుగా హాజరైన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు
- అమరవీరుల బంధువులకు జ్ఞాపికలు అందజేత



అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేస్తున్న జేసీ సూరజ్ గనోరే

నరసరావుపేట: సమాజానికి పోలీసులు చేసే సేవలు అనిర్వచనీయమని, ఆ వ్యవస్థ లేని సమాజాన్ని మనం ఊహించలేమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. స్థానిక సత్తెనపల్లిరోడ్డులోని కోడెల శివప్రసాదరావు డీఎస్ఏ ప్రాంగణంలో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం పోలీసు అమరవీరులకు ఘనంగా అంజలి ఘటించారు. జిల్లా ఏఆర్ డీఎస్పీ జి.మహాత్మాగాంధీ పర్యవేక్షణలో ఆర్ఐ ఎం.రాజా పరేడ్ కమాండర్‌గా అమరవీరుల స్థూపానికి పోలీసులు స్మృతి పరేడ్ నిర్వహించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమానికి ముఖ్య అతిథులు, గౌరవ అతిథులుగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావులతోపాటు జేసీ సూరజ్ గనోరే, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, చిలకలూరిపేట, నరసరావుపేట ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబులు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ లేకపోతే సమాజంలో సంఘ విద్రోహశక్తుల ఆగడాలకు అడ్డు ఉండదని, దేశ సరిహద్దుల్లో సైనికులు, దేశంలో పోలీసులు నిత్యం పహారా కాస్తూ ప్రజల ధన, మాన ప్రాణాలను రక్షిస్తున్నారన్నారు. సంఘ విద్రోహ శక్తులను అణచే క్రమంలో ఎంతోమంది పోలీసులు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. వారి ప్రాణత్యాగం వెలకట్టలేనిదని, సమాజ హితం కోసం ప్రాణ త్యాగం చేసిన ఆ మహావీరుల త్యాగాన్ని స్మరించుకోవడం మనకు ఎంతో గర్వకారణమని అన్నారు. వారి స్ఫూర్తిని ముందుకు కొనసాగిస్తూ పోలీస్ శాఖ ప్రజలకు సమాజానికి మరిన్ని సేవలను అందిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అసువులు బాసిన సిబ్బంది కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. పోలీస్ శాఖకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటివరకు పల్నాడు జిల్లాలోని తొమ్మిది మంది పోలీసులు వీరమరణం పొందారని అన్నారు. వీరందరికీ మనస్ఫూర్తిగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నామన్నారు. వారి కుటుంబ సభ్యులను ప్రతి ఏడాదీ పిలిచి సన్మానించుకుని, వారికి ఉన్న సమస్యలను తెలుసుకొని వాటిని తీర్చడానికి కృషిచేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు అరవిందబాబు, పుల్లారావు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగం వెలకట్టలేనిదని అన్నారు. వారి త్యాగస్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా వీర మరణం పొందిన ఒక ఎస్ఐ, ఎనిమిది మంది పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులను సన్మానించి, వారికి పల్నాడు జిల్లా పోలీస్ శాఖ తరఫున అతిథులు జ్ఞాపికలు అందజేశారు. అదనపు పరిపాలన ఎస్పీ జేవీ.సంతోష్, శాంతిభద్రతల విభాగ అదనపు ఎస్పీ సీహెచ్.లక్ష్మీపతి, నరసరావుపేట, సత్తెనపల్లి డీఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంతరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదు పరిష్కరించాలి

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీల స్వీకరణ



కలెక్టరేట్‌లో కలెక్టర్, అధికారులకు అర్జీలు అందజేస్తున్న బాధితులు

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి హాజరైన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై 105 అర్జీలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో సదూర ప్రాంతాల నుంచి అర్జీదారులు ఇక్కడకి వస్తుంటారని, అటువంటి వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, ఆ పరిష్కారంతో అర్జీదారు సంతృప్తి చెందాలని సూచించారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కారం చూపాలని అన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాస్‌బుక్‌లు ఇప్పించండి

నాకు, నా సోదరుడికి కలిపి నా తండ్రి నుంచి వచ్చిన 5.5 ఎకరాల భూమి ఉంది. దీనికి చెరి సమానంగా మాకు పట్టాదారు పాస్‌బుక్‌లు మంజూరు చేయాలని కోరుతున్నా ఏదో ఒక కొర్రి వేసి వీఆర్వో ఆపుతున్నాడు. మా సోదరుల మధ్య ఎటువంటి వివాదాలు లేవు. వెంటనే పాస్‌బుక్‌లు మంజూరుచేయండి.

–చల్లా శ్రీనివాసరావు, తొండపి, ముప్పాళ్ల

ఆక్రమణలు తొలగించండి

బరంపేట సత్తెనపల్లిరోడ్డులోని కత్తవ చెరువును కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాలు వర్షపు నీటితో మునిగిపోకుండా ఈ చెరువు సహకరిస్తుంది. ఈ మధ్యనే కొంతమంది చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేస్తునారు. మున్సిపల్ అధికారులకు తెలియచేసినా అధికార పార్టీ వారు కావటంతో పట్టించుకోవట్లేదు. వెంటనే వారికి నోటీసులు జారీచేసి నిర్మాణాలను నిలుపుదల చేయటంతోపాటు చేసిన నిర్మాణాలను తొలగించాలి.

–షేక్ కరీముల్లా, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు

రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించండి



మేము గుంటగార్లపాడులో సర్వే నెం.110/3లోని 1.90 ఎకరాల్లో వేసిన ప్లాట్లను కొనుగోలు చేశాం.ఎండోమెంట్ శాఖ విజ్ఞప్తి మేరకు సమీపంలోని వారి భూములతో పాటు ప్రైవేటు భూముల్లోని తమ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయకుండా రిజిస్ట్రేషన్ శాఖ బ్లాక్ చేసింది. దీంతో తాము చాలా ఇబ్బందిపడుతున్నాం. మా సర్వే నంబరును బ్లాక్ నుంచి తప్పించి మా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకునేలా అవకాశం కల్పించండి.

–బాధితులు

మార్కెట్‌లో విజిలెన్స్ తనిఖీలు

సాక్షి కథనంపై అధికారుల్లో కదలిక

మార్టూరు: రైతులను దళారులు మోసం చేస్తున్నారన్న కథనంతో కదిలిన అధికారులు కూరగాయల మార్కెట్‌లో తనిఖీలు నిర్వహించారు. సోమవారం మండల కేంద్రం మార్టూరు జాతీయ రహదారి పక్కన గల కూరగాయల మార్కెట్‌లో మార్కెటింగ్ విజిలెన్స్ అధికారులు మధ్యాహ్నం తనిఖీలు నిర్వహించారు. 'రైతుల కష్టం.. దళారుల భోజ్యం' శీర్షికన ఈనెల 18వతేదీ 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందనగా అధికారులు కమీషన్ వ్యాపారులు, రైతులను స్వయంగా విచారించారు. విచారణలో మార్కెట్‌లో రైతులకు జరుగుతున్న అన్యాయం, అక్రమాల డొల్లతనం కనిపించడం గమనార్హం. మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సువర్చల కమిషన్ వ్యాపారుల కాటాలకు సీలు వేయని పరిస్థితిని గమనించి ప్రశ్నించారు. రైతులు తాము వ్యాపారులకు విక్రయించిన కూరగాయలపై 8 శాతం కమీషన్ మినహాయించుకొని తమకు వ్యాపారులు నగదు చెల్లిస్తున్నట్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. తూకంలో తారం పేరుతో రెండు నుంచి నాలుగు కిలోల బరువును ప్రతి బస్తాకు తగ్గిస్తున్నట్లు రైతులు ఆమెకు తెలిపారు.

ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో ఇసుక పంపిణీ

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు



కలెక్టరేట్ నుంచి అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రోజూ వారీ కోటాలో 50 శాతం ఇసుక ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా, మరో 50 శాతం రీచుల వద్ద ఆఫ్‌లైన్ బుకింగ్ ద్వారా పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి ఇసుక, ఎరువుల పంపిణీ, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, ఆధార్ ప్రత్యేక శిబిరాలు, ప్రభుత్వ పనుల వంటి ప్రాధాన్యత అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇసుక పంపిణీ తర్వాత ఇసుక డెలివరీ ఆడిట్‌ను పూర్తి చేయాలన్నారు. స్టాక్ పాయింట్లు, రీచులతో పాటూ అక్రమ తరలింపునకు అవకాశం ఉన్న రూట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచాలన్నారు. వచ్చే వారం నుంచి ప్రభుత్వ శాఖల పరిధిలో నిర్మాణాలకు ఇసుకను రిజర్వ్ చేసి నిరాటంకంగా పంపిణీ చేస్తామన్నారు. వచ్చే వారం నుంచి ప్రతి రెండు వారాలకోసారి జిల్లా అధికార యంత్రాంగంతో నియోజకవర్గాల వారీగా ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. రేపటి నుంచి నాలుగు రోజుల పాటూ జిల్లా వ్యాప్తంగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కోసం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఆధార్ క్యాంపులలో అవసరమైన సిబ్బందిని నియమించాలన్నారు. గ్రామాల్లో దండోరా వేయించి షెడ్యూల్‌ను సచివాలయంలో ప్రదర్శించి ప్రచారం కల్పించాలన్నారు. హౌస్ హోల్డ్ డేటా ద్వారా ఇప్పటి వరకూ గుర్తింపు లేనివారిని గుర్తించి ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయాలన్నారు. రబీ సీజన్ ప్రారంభం అయినందున ఎరువులు, పురుగుమందుల కొరత రాకుండా చూడాలన్నారు. తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు ప్రతిరోజూ ఎరువుల అంగళ్లను తనిఖీ చేసి నకిలీ, అధిక ధరలకు ఎరువులు విక్రయించేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. జేసీ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వినాయకం, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, సీపీవో జి.శ్రీనివాస్, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి నాగయ్య, జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్.వి.రమణారెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, డీఎల్డీవోలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీఆర్‌కి దాచేపల్లి సీఐ



దాచేపల్లి: దాచేపల్లి సీఐ గుత్తి వెంకట్రావ్ వీఆర్‌కి వెళ్లారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు 31న దాచేపల్లి సీఐగా వెంకట్రావ్ బాధ్యతలు చేపట్టారు. 50 రోజులపాటు సీఐగా విధులు నిర్వర్తించిన ఆయన కూటమి నేతలను సంతృప్తిపరచలేదనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి నేతల ఒత్తిడి మేరకు సీఐ వెంకట్రావ్‌ని వీఆర్ పంపినట్లు సమాచారం.

ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రవికుమార్



నరసరావుపేట ఈస్ట్: ఏపీటీఎఫ్ పల్నాడుజిల్లా ప్రధాన కార్యదర్శిగా వి.వి.రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పల్నాడురోడ్డులోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా, పరిశీలకునిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సయ్యద్ కరిముల్లా వ్యవహరించారు. ప్రస్తుత జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న మక్కెన శ్రీనివాసరావు ఇటీవల జరిగిన ఏపీటీఎఫ్ కౌన్సిల్ ఎన్నికల్లో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావటంతో రవికుమార్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రవికుమార్ తెలిపారు.

త్రివర్ణపతాకంపై ఇంద్రధనస్సు



దాచేపల్లి: సాగర్ సిమెంట్స్ ప్రాంగణంలో అరుదైన దృశ్యం సోమవారం కనిపించింది. పల్నాడు జిల్లా గామాలపాడు గ్రామ సమీపంలోని సాగర్ సిమెంట్స్ ప్రాంగణంలో ఇటీవల ఆవిష్కరించిన త్రివర్ణపతాకంపై ఇంద్రధనస్సు విరిసింది. భారీ వర్షం కురిసిన తరువాత ఆకాశంలో వెలసిన ఇంద్రధనస్సు జాతీయపతకంపై వాలినట్లుగా ఈ దృశ్యం కనిపిస్తుంది. ఫ్యాక్టరీ అధికారులతో పాటుగా కార్మికులు ఈ దృశ్యాన్ని ఆసక్తిగా తిలకించారు.

నిర్ణీత గడువులోగా అర్జీలు పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు
- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 43 ఫిర్యాదులు స్వీకరణ
- ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఎస్పీ ఆదేశం



అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఆయన అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులచే కుటుంబ, ఆర్థిక, ఆస్తి, మోసం, తగాదాలకు సంబంధించిన 43 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

ట్రేడింగ్ యాప్‌తో మోసం

నేను ట్రేడింగ్ యాప్ ద్వారా రూ.5.64 లక్షలు పెట్టుబడులు పెట్టగా లాభం చూపించింది. విత్‌డ్రా చేసుకుందామని చూడగా మరో రూ.2లక్షలు చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. దీనిపై సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదుచేయగా ఆ నగదును హోల్డ్‌లో పెట్టారు. ఆ డబ్బులు ఇప్పించి నాకు న్యాయం చేయండి.

–ఎల్.అజయ్‌కుమార్, దాచేపల్లి

డబ్బులు అడిగితే బెదిరిస్తున్నారు..

మా పిల్లలకు కాంట్రాక్ట్ బేసిస్‌పై ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి టి.నారయ్య అనే వ్యక్తి రూ.20లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగాలు ఇప్పించలేదు. డబ్బులు తిరిగి ఇవ్వలేదు. ఆయన ఇంటి వద్దకు డబ్బులు అడిగేందుకు వెళితే డబ్బులు ఇవ్వకపోగా ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని బెదిరిస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయండి.

–షేక్ సైదా, షంషాద్, మహబూబు బాషా, శ్రీలక్ష్మి, శ్రీనివాసనగర్, నరసరావుపేట పట్టణం

డబుల్ ఇస్తామని రూ.25లక్షలు తీసుకొని మోసం

పిన్నెల్లి గ్రామానికి చెందిన నాయక్, తాలీబ్‌లు వజ్రాలు శుద్ధి చేసేందుకు డబ్బులు ఇస్తే తిరిగి రెండింతలు ఇస్తామంటూ రూ.25 లక్షలు తీసుకున్నారు. ఆ డబ్బులు తిరిగి ఇవ్వమంటే ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతున్నారు. వారిపై చర్యలు తీసుకొని మా డబ్బులు ఇప్పించండి.

–రసూలుల్లా, పేరిరెడ్డి, రవీంద్ర, పిన్నెల్లి, వేమవరం గ్రామాలు

నేటి నుంచి మంగళవారోత్సవాలు ప్రారంభం



విచారణ గురువులు రెవ. ఫాదర్ వైఎల్ మర్రెడ్డి



రెంటచింతలలోని అంతోనివారి మందిరం

రెంటచింతల: స్థానిక అంతోనివారి మందిరంలో మంగళవారం నుంచి 9 మంగళవారోత్సవాలు ప్రారంభమవుతాయని కానుకమాత చర్చి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ వైఎల్ మర్రెడ్డి చెప్పారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీస్తు జయంతి మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ 9 మంగళవారోత్సవాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పునీత అంతోనివారి ఆశీస్సులు పొందాలని కోరారు. 2024 డిసెంబర్ 24న తొమ్మిదో మంగళవారం కానుక మాత చర్చిలో రాత్రి 11 గంటలకు నిర్వహించే క్రీస్తు జయంతి మహోత్సవ దివ్యపూజాబలికి ముందు ఈ 9 మంగళవారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 22న ఫాదర్ గంజి బాలస్వామిరెడ్డి, 29న ఫాదర్ జాకోబురెడ్డి, నవంబర్ 5న ఫాదర్ పవిత్రన్, 12న ఫాదర్ గాదె కిశోర్ రెడ్డి, 19న ఫాదర్ మర్రి అనిల్, 26న ఫాదర్ పెదకోట్ల జోజప్ప, డిసెంబర్ 3న ఫాదర్ కోడిగంటి నిఖిల్ తేజ, 10న ఫాదర్ పుట్టి అంతోని రాజు, 17న ఫాదర్ మాదాసు జోజప్ప దివ్యపూజాబలి సమర్పించి భక్తులకు పునీత అంతోనివారి జీవిత చరిత్ర, ఆయన చేసిన అద్భుతాలను వివరిస్తారన్నారు. ప్రతి మంగళవారం సాయంత్రం 5 గంటలకు జపమాల, అనంతరం దివ్యపూజాబలి సమర్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సహాయక గురువులు ఫాదర్ అగస్టిన్ తదితరులున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో కేంద్ర బృందం పర్యటన



గ్రామసభలో ప్రజలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు శ్రీరామ్, రోహిత్

మాచర్ల రూరల్: గ్రామీణ ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనుల నిర్వహణ తీరుపై కేంద్ర బృందం సభ్యులు మండలంలోని లింగాపురం, ఏకోనాంపేట గ్రామాలలో సోమవారం పర్యటించారు. ఈ పర్యటనలో వారు జాతీయ ఉపాధి హామీ పథకం పనులు, వాటి తీరు రైతులను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో ఉపాధి పనులు జరుగుతున్నాయా, నిర్ణీత సమయంలో పనులు పూర్తయితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటున్నాయా అంటూ రైతులను ప్రశ్నించారు. వర్మీకంపోస్టు యార్డు, కృత్రిమ ఎరువులు వలన ఉపయోగాలు, గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై వారు సమీక్షించారు. అనంతరం మొక్కలు నాటి వాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు, రోహిత్, శ్రీరామ్, ప్రాజెక్టు డైరెక్టర్లు సిద్దా లింగమూర్తి, బాలునాయక్ ఎంపీడీఓ ఫణికుమార్, హౌసింగ్ డీఈ విభూషణ్, ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, ఏపీఓ నాగ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి, వెలుగు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దయనీయ స్థితిలో ప్రభుత్వ వసతి గృహం

- అదనపు జిల్లా న్యాయమూర్తి తనిఖీల్లో బయటపడ్డ డొల్లతనం
- హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలకు సిఫార్సు

నరసరావుపేటటౌన్: ప్రభుత్వ వసతి గృహాల్లో కనీస వసతులు కల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటంపై 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు అదనపు జిల్లా న్యాయమూర్తి ప్రభుత్వ వసతి గృహాలను తనిఖీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం రెడ్డినగర్ వద్ద గల ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల వసతి గృహాన్ని సందర్శించారు. తనిఖీల్లో వసతి గృహంలో ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు లేకపోవడం, కనీసం తాగు నీటి సదుపాయం కూడా లేకపోవడాన్ని గమనించారు. దీంతోపాటు మంచినీటి ట్యాంకులు పాచి పట్టి ఉండడం, పురుగులు పట్టిన బియ్యం, నాసిరకం కంది పప్పు, రవ్వలు ఉండటాన్ని గుర్తించారు. ఈ సీజన్‌లో దోమల నివారణకు తీసుకోవాల్సిన కనీస చర్యలు కూడా తీసుకోలేదు. పారిశుద్ధ్యం దయనీయంగా కనిపించింది. విద్య కోసం సుదూర తీరాల నుండి వచ్చే విద్యార్థుల పట్ల హాస్టల్ సిబ్బంది కనీస మానవతా దృక్పథంతో కూడా వ్యవహరించకుండా ఉండటం పట్ల న్యాయాధికారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటనపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు లేఖ రాయనున్నట్లు సమాచారం.

సేవలోనే అసలైన ఆనందం

- విద్యాదాత నడికట్టు రామిరెడ్డి
- ఘనంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల వార్షికోత్సవాలు



మాట్లాడుతున్న నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల: నాకు జన్మనిచ్చిన గ్రామాన్ని, నా గ్రామ ప్రజలను అభివృద్ధి పథంలో నడపటమే నా లక్ష్యంగా కృషి చేస్తున్నానని, సేవలోనే అసలైన ఆనందం ఉంటుందని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి అన్నారు. చిరుమామిళ్ల గ్రామంలోని కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక పాఠశాల 91వ వార్షికోత్సవం, నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 16వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన్ను పూలమాలలతో సత్కరించి కేక్ కట్‌చేశారు. రామిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని రెండు పాఠశాలల్లో వార్షికోత్సవాలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తున్నది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన బహిరంగ సభలో పలువురు వక్తలు మాట్లాడారు. భారతదేశంలోని ఓ గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీ రోడ్లు, మంచి భవనాలతో పాఠశాలలు, సెంట్రల్ లైటింగ్ వంటి అధునాతన సౌకర్యాలు చిరుమామిళ్లలో ఉన్నాయంటే నడికట్టు రామిరెడ్డి కృషి అని పేర్కొన్నారు. నగరాలకు ధీటుగా మౌలిక వసతులు, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు తోడ్పాటు, మధ్యాహ్న భోజనంతో తన చొరవ చూపుతూ రామిరెడ్డి ఆదర్శంగా నిలిచారన్నారు. సంపద ఎంతోమందికి ఉన్నా దాతృత్వ గుణం కొందరికే ఉంటుందని పేర్కొన్నారు. విద్యాదాత నడికట్టు రామిరెడ్డి మాట్లాడుతూ తాను పుట్టిన గ్రామానికి తాను జీవించి ఉన్నంత వరకూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. గ్రామస్తుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేయగలిగానని, భవిష్యత్తులోనూ గ్రామాభివృద్ధి, విద్యాభివృద్ధికి తన వంతుగా సహాయసహకారాలు అందిస్తానని చెప్పారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

విద్యాదాత నడికట్టు రామిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, న్యాయవాది బాలహనుమంతరెడ్డి, సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సింగారెడ్డి కోటిరెడ్డి, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు సిరిపురపు అప్పారావు, ఎంఈఓ ఈమని కృష్ణారెడ్డి, ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ ఝాన్సీ వాణి, జెడ్పీ హైస్కూలు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలు సుందరరావు, కరిముల్లా, బాలచంద్రారెడ్డి, యన్నం శివారెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న డ్రోన్ వర్క్‌షాప్



డ్రోన్‌ల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

నరసరావుపేట రూరల్: సాంకేతిక రంగంలో డ్రోన్‌ల వినియోగం అధికంగా ఉందని ఇండియన్ డ్రోన్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ కె.వంశీకృష్ణ తెలిపారు. ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇండియన్ డ్రోన్ అకాడమీ సహకారంతో సోమవారం డ్రోన్ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఇండియన్ డ్రోన్ అకాడమీ సీఈవో ఆర్.దేవ్, ఆపరేషన్ హెడ్ సందీప్ శ్రీనివాస్, శివలోకం ప్రాజెక్ట్ డైరెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అన్ని రంగాల్లో డ్రోన్‌లను వినియోగిస్తున్నట్లు తెలిపారు. కేవలం ఎంటర్‌టైన్‌మెంట్ వీడియోలకే కాకుండా వ్యవసాయం, నిర్మాణం, విపత్తుల సమయంలో కూడా డ్రోన్‌లను వినియోగిస్తున్నాని తెలిపారు. విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. డ్రోన్ రెగ్యులేషన్, సేఫ్టీ, డ్రోన్ ఫ్లయిట్ డెమో, ఇండస్ట్రీ అప్లికేషన్స్, డ్రోన్ ఫొటోగ్రఫీ, ఉద్యోగ అవకాశాలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి షేక్ కరీంమోహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్‌షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమ్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన వర్గీయుల ఘర్షణ

- ఏడుగురికి గాయాలు
- గాయపడ్డవారిలో ఇద్దరు జనసేనకు చెందిన మహిళలు.
- గ్రామాన్ని సందర్శించిన డీఎస్పీ, పోలీసులు.
- ఇరు వర్గాలకు చెందిన వారిని పోలీసుస్టేషన్ తరలింపు



గాదెవారిపాలెంలో ఘర్షణలకు కారణమైన వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

క్రోసూరు: టీడీపీ, జనసేన నాయకుల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల కార్యకర్తలు రాళ్లు, కర్రలతో పరస్పరం దాడి చేసుకున్నారు. దాడిలో పలువురు గాయపడ్డారు. డీఎస్పీ గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. మండలంలోని గాదెవారిపాలెం గ్రామంలో సైడు కాలువలు తవ్వే విషయమై టీడీపీ, జనసేన వర్గీయుల మధ్య వివాదం చెలరేగింది. నాలుగురోజులుగా ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం జరుగుతుంది. సోమవారం వేకువజామున రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులకు దిగారు. దాడుల్లో టీడీపీకి చెందిన నలుగురికి, జనసేనకి చెందిన ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నట్లు తెలిసింది. గాయపడ్డ వారిని సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ హనుమంతరావు, ఎస్ఐ నాగేంద్రరావు, పోలీసు సిబ్బంది గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చేందుకు ఇరువర్గాలకు చెందిన కొంతమందిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. క్రోసూరులో ప్రజాదర్బార్‌కు హాజరైన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను జనసేన పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి రామకృష్ణ కలసి పరిస్థితి వివరించినట్లు తెలిసింది.

గౌరవ వేతనాలు చెల్లించాలి

తొలగించిన యానిమేటర్ల డిమాండ్



మండల సమాఖ్య కార్యాలయం వద్ద మాట్లాడుతున్న తొలగించిన యానిమేటర్లు

దాచేపల్లి: తమను అన్యాయంగా విధుల నుంచి తొలగించారని, తమకు రావాల్సిన గౌరవ వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని తొలగించిన యానిమేటర్లు ఆరోపించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయం వద్దకు తొలగించిన యానిమేటర్లు సోమవారం వచ్చారు. ఏపీఎంని కలిసేందుకు సమాఖ్య కార్యాలయానికి వస్తే ఆయన అందుబాటులో లేరు. తొలగించిన యానిమేటర్లు అక్కడ విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మండల పరిధిలో 18 మంది యానిమేటర్లను అక్రమంగా, అన్యాయంగా తొలగించారని, తమకు 5 నెలల గౌరవ వేతనాలు చెల్లించాల్సి ఉండగా 2 నెలల గౌరవ వేతనాలు గ్రామ సమాఖ్య బ్యాంక్ అకౌంట్‌లో జమయ్యాయని వారు చెప్పారు. తమకు రావాల్సిన గౌరవ వేతనాలను గ్రామ సమాఖ్య వారు ఇవ్వకుండా కూటమి నాయకులు చెప్పారని మండల సమాఖ్యతోపాటుగా సంబంధిత అధికారులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి తాము పనిచేస్తే తమకు రావాల్సిన గౌరవ వేతనాలను కొత్తగా విధుల్లో చేరిన యానిమేటర్లకు ఇస్తామని చెప్పటం తమకు బాధ కలిగించిందని, తమ గౌరవ వేతనాలు తమకు చెల్లించాల్సిందేనని వారు డిమాండ్ చేశారు. తమకు గౌరవ వేతనాలు చెల్లించకపోతే అవసరమైతే ఉద్యమం చేస్తామని తొలగించిన యానిమేటర్లు సుమతీ, రమాదేవి, హైమవతి, లూకయ్య, మరియమ్మ, మేరి తదితరులు హెచ్చరించారు.

కార్తిక ఉత్సవాలకు ఇంద్రకీలాద్రి సిద్ధం

- మల్లేశ్వర స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు
- నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు ఉత్సవాలు
- నిత్యం సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకరణ సేవ



మల్లేశ్వరస్వామి దేవస్థానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం కొలువైన ఇంద్రకీలాద్రి కార్తిక మాసోత్సవాలకు సిద్ధమైంది. నవంబర్ రెండు నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు కార్తిక మాసోత్సవాల్లో నిత్యం మల్లేశ్వరస్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు జరుగుతాయి. రోజూ మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన, సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, ఆకాశ దీపోత్సవం నిర్వహిస్తారు. ప్రత్యేకంగా స్వామికి బిల్వార్చన, కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం, మాస శివరాత్రి వంటి పర్వదినాలను విశేషంగా నిర్వహిస్తారు. నెల రోజులపాటు స్వామికి నిర్వహించే విశేష పూజల్లో భక్తులు పాల్గొనేందుకు ఆర్జిత సేవా టికెట్లు విక్రయిస్తోంది.

ఆర్జిత సేవలు ఇవీ..

కార్తిక మాసోత్సవాన్ని పురస్కరించుకుని మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం ఎనిమిది గంటలకు కాలక పారాయణలు, శివ పంచాక్షరి, లక్ష్మీగణపతి జపాలు, సహస్ర లింగార్చన జరుగుతాయి. రోజూ సాయంత్రం 3.30 నుంచి ఏడు గంటల వరకు అభిషేకాలను నిర్వహిస్తారు. స్వామికి జరిగే అభిషేకాల్లో పాల్గొనే భక్తులు టికెట్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

ఆకాశ దీపం

కార్తికమాసం నెల రోజులు ప్రదోష కాలంలో అమ్మ వారి ప్రధాన ఆలయం, మల్లేశ్వర స్వామి గుడి, శివకామ సుందరీ సమేత నటరాజస్వామి ఆలయ ప్రాంగణంలో ఆకాశ దీపాన్ని వెలిగిస్తారు. సాయంత్రం స్వామికి మహానివేదన, పంచహారతులు, చతుర్వేద స్వస్తి, అనంతరం సహస్ర దీపాలంకరణ సేవ జరుగుతాయి. ఆది దంపతుల ఉత్సవమూర్తులకు సహస్ర దీపాలంకరణ సేవలో భక్తులు పాల్గొనే అవకాశాన్ని దేవస్థానం కల్పిస్తోంది. ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సహస్రదీపాలంకరణ సేవ జరుగుతుంది. ఆలయ అర్చకులతోపాటు అధికారులు స్వయంగా దీపాలను వెలిగించి సేవ చేసుకుంటారు. ఈ సేవలో భక్తులు పాల్గొనే అవకాశాన్ని దేవస్థానం కల్పిస్తోంది.

15న కోటి దీపోత్సవం

కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని నవంబర్ 15వ తేదీన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో కోటి దీపోత్సవాన్ని నిర్వహిస్తారు. ఆది దంపతుల ఆలయాలతోపాటు ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలు, మహామండపం, రాజగోపురం, ఘాట్‌రోడ్డు పరిసరాలను దీపాలతో అలంకరిస్తారు. రాత్రి మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నిర్వహిస్తారు. ఇక 29వ తేదీ మాస శివరాత్రిని పురస్కరించుకుని స్వామికి అన్నాభిషేకం జరుగుతుంది.

ప్రత్యేక బిల్వార్చన తేదీలు

కార్తిక మాసంలో మల్లేశ్వర స్వామికి ప్రత్యేక తిథుల్లో బిల్వార్చన నిర్వహిస్తారు. నవంబర్ నాలుగో తేదీన శుద్ధ చవితి, 11న శుద్ధ దశమి, 12న శుద్ధ ఏకాదశి, 15న పౌర్ణమి, 18న బహుళ తదియ, 25న బహుళ దశమి, 26న బహుళ ఏకాదశి, 29న మాస శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక బిల్వార్చన నిర్వహించాలని వైదిక కమిటీ నిర్ణయించింది.

పులిచింతలకు 2,13,088 క్యూసెక్కులు విడుదల



టెయిల్‌పాండ్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు ద్వారా పులిచింతల ప్రాజెక్టుకు వదిలిన వరదనీరు

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు ద్వారా 2,13,088 క్యూసెక్కులు దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ జయపాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు 13 క్రస్టుగేట్లు 3 మీటర్లు, ఒక క్రస్టుగేటు 2.5 మీటర్లు ఎత్తి 2,13,088 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న కృష్ణానదికి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టులో నున్న రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 75.50 మీటర్లకుగాను 75.09 మీటర్లకు నీరు చేరుకుందన్నారు. ప్రాజెక్టు రిజర్వాయర్‌లో గరిష్ట నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకుగాను ప్రస్తుతం 6.799 టీఎంసీలు నిల్వ ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 60.27 మీటర్లకు చేరుకుందన్నారు. నాగార్జునసాగర్ నుంచి 2,12,272 క్యూసెక్కుల వరదనీరు టెయిల్‌పాండ్ రిజర్వాయర్‌కు వస్తుందన్నారు.

అండర్–14 ఫుట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక



ఎంపికైన ఫుట్‌బాల్ బాల, బాలికల జట్లతో సురేష్‌కుమార్, శ్రీనివాసరావు, వినయ్‌కుమార్, పీడీలు

సత్తెనపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–14 ఫుట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగాయి. ఎంపికల ప్రక్రియను పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగభైరు సురేష్‌కుమార్ పర్యవేక్షించారు. జిల్లా నలుమూలల నుంచి బాలుర విభాగంలో 170 మంది, బాలికల విభాగంలో 90 మంది ఎంపికలకు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25 నుండి 27 వరకు శ్రీ సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో జరిగే 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొంటారని పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి యన్. సురేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాకరపర్తి శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సి.హెచ్.వినయ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య, బి.అనీల్ దత్తా నాయక్, కాకుమాను సునీత, జాలా శిరీష, రియాజ్, షేక్ పెద్ద కరీముల్లా పాల్గొన్నారు.

బాలుర జట్టు

కె.సాయిచరణ్, వై గోపీచంద్, కె చిరంజీవి, పి చరణ్, వై విజయ్‌రాఘవరెడ్డి, డి.జాన్ అఫ్రాన్, వి వెంకట నాగ సురేంద్ర, వై.ఎం.యన్.గణేష్, ఎం మనోహర్, సీహెచ్ హర్షవర్ధన్, టి గౌరీశంకర్, పి భాను శ్రీ సంజయ్, ఎం అనీష్, ఎం సంజయ్, వి.నిఖిల్, పి తేజ సాయి, షేక్ మహమ్మద్ సైఫుల్లా, స్టాండ్ బైలుగా కె.క్రాంతి వర్ధన్, ఎఫ్.అఫ్రాన్, ఎన్.హరినాథ్‌లు ఎంపికయ్యారు.

బాలికల జట్టు

డి.శ్రీలక్ష్మీప్రసన్న, ఆర్.చైత్రశ్రీ, జి.పుష్పలత, పి.అక్షయ, డి స్వప్న, పి దివ్యశ్రీ, టి శ్రీవల్లి, పి అలేఖ్య, సీహెచ్.అకీర, జి చిన్మయి, టీ త్రివేణి, పి ప్రవల్లిక, టి హేమశ్రీ, ఎస్ రుచిత, ఎం జాహ్నవి, జి అను, షేక్ సమీరా, పి శ్రీలక్ష్మి, స్టాండ్ బైలుగా టీ త్రివేణి, ఎస్ మంజుల, వై.శిరీషలు ఎంపికయ్యారు.